# అంతా రామమయం



అగస్త్యేశ్వరాలయంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



అగస్త్యేశ్వరాలయంలో సీతారాముల కల్యాణం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** పట్టణంలోని పలు రామాలయాలలో గురువారం శ్రీరామనవమి వేడకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అన్ని రామాలయాల్లో సీతారాముల, లక్ష్మణ, ఆంజనేయస్వామి దేవతా మూర్తులకు విశేష అభిషేకాలు చేశారు. సీతారాముల ఉత్సవ మూర్తులకు కన్నుల పండువగా కల్యాణోత్సవం జరిపించారు. స్థానిక అగస్త్యేశ్వరాలయంలోని అభయవరద సీతారామచంద్రస్వామి ఆలయంలో మిథునలగ్న పుష్కరాంశములో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, భక్తులు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు. మెయిన్ బజార్‌లోని ఆత్మారామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకుడు సనాస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పెద్ద రామయ్య, కార్యదర్శి రామాంజనేయులు, ట్రెజరర్ నాగరాజు, మేనేజర్ రఘువర్దన్, భక్తులు పాల్గొన్నారు. దేవాంగ పేటలోని కోదండ రామ స్వామి ఆలయంలో దేవతామూర్తులకు సుందరంగా అలంకరించారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ హోమాలను చేసి పూర్ణాహుతి సమర్పించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే వసంతపేట, అయోధ్యానగర్, రామేశ్వరం. బిత్తలయ్య చావిడితోపాటు పలు ప్రాంతాలలోని ఆలయాల్లో, పలు గ్రామాలలోని ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు.

**పానకం, వడపప్పు పంపిణీ**

**ప్రొద్దుటూరు :** శ్రీరామ నవమి పండుగ సందర్భంగా గురువారం ప్రొద్దుటూరు పట్టణంలో అడుగడుగునా పలు స్వచ్ఛంద సంస్థలతోపాటు పలువురు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. హోమస్‌పేట, కోనేటి కాలువ వీధి, సుబ్బిరెడ్డికొట్టాల, శ్రీరామ్‌నగర్, ఆర్ట్స్ కాలేజి రోడ్డు తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. పోస్టల్ డివిజన్ కార్యాలయం వద్ద అవోప మహిళా విభాగం ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి, కోశాధికారి హేమలత, ఈసీ మెంబర్లు ఉషారాణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

■ లైట్‌మోటార్ వెహికల్స్ పాతబస్టాండ్ ట్యాక్సీ స్టాండ్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం పాత బస్టాండ్ వద్ద పానకం, వడపప్పు ప్రజలకు పంపిణీ చేశారు.

■ స్థానిక పట్టాభిరామ మండి కాంప్లెక్స్‌లోని శ్రీరామాలయంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల కల్యాణోత్సవం వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిసెట్టి బాబు, టీటీడీ పాలమండలి మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, పట్టాభిరామ మండి కాంప్లెక్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**కల్యాణం.. కమనీయం**

**రాజుపాళెం :** మండలంలోని టంగుటూరులో కోదండ రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. కాచన వెంకటసుబ్బారెడ్డి, కాచన సుభాష్‌రెడ్డి, కాచన రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో బాబురెడ్డి, నిశాంత్‌లు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. లింగారెడ్డి, నాగేంద్ర, అర్చకులు చక్రపాణి, విజయవర్ధన్ రావు, ప్రదీప్, భక్తులు పాల్గొన్నారు. అలాగే రాజుపాళెంలోని శివాలయంలో మాధవరెడ్డి, నీలవేణిలు సొంత ఖర్చులతో సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను అందించారు. అనంతరం వారు కల్యాణాన్ని చేయించారు.

■ రాజుపాళెంలో కోదండరామస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం ఆలయ ధర్మకర్త సుంకు రామకృష్ణయ్య వడపప్పు, పానకాన్ని పంపిణీ చేశారు. ముందుగా ఆలయంలోని సీతారామలక్ష్మణ ఆంజనేయస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం గరుత్మంతుడి వాహనంపై ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులంతా వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీరాముడు మానవాళికి మార్గదర్శి



తలంబ్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

**ప్రొద్దుటూరు :** శ్రీరాముడే మానవాళికి మార్గదర్శకమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా స్థానిక కోనేటి కాలువ వీధిలోని శ్రీపట్టాభి రామస్వామి దేవస్థానం వద్ద గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోడెం సందీప్ అందించిన ముత్యాల తలంబ్రాలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 11వ వార్డు ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

■ సుబ్బిరెడ్డి కొట్టాలులో (చౌడేశ్వరినగర్) శ్రీరామ ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ ముత్యాల తలంబ్రాలను అందించారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, కౌన్సిలర్ గరిభపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## మైదుకూరులో..



చాపాడు : సిద్దారెడ్డిపల్లెలో సీతారాముల కళ్యాణ మహోత్సవం

**మైదుకూరు :** మైదుకూరులో గురువారం శ్రీరామనవమి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక పాత ఊరులోని కోదండరామాలయం, నంద్యాల రోడ్డు, శ్రీరామ్‌నగర్, గాంధీనగర్, పాలెం రోడ్డులో ఉన్న రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం జరిపారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

**చాపాడు:** మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాపాడు, విశ్వనాథపురం, సిద్దారెడ్డిపల్లె, నాగాయపల్లె, చియ్యపాడు, గుంతచీపాడు, లక్ష్మీపేట, శ్రీరాములపేట, పల్లవోలు తదితర గ్రామాలలోని రామాలయాల వద్ద సీతారాముల కళ్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో వేడుకలకు హాజరైన ప్రజలందరికీ అన్నదానం నిర్వహించారు.

■ మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో గురువారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య, సర్పంచ్ కిషోర్ కుమార్ రెడ్డి, ఆర్యవైశ్య సభ రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతు సుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూజల అనంతరం వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు.

■ మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థానం వద్ద గురువారం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

**దువ్వూరు :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం మండల వ్యాప్తంగా సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన దువ్వూరు, పాత దువ్వూరు, గుడిపాడు తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను జరుపుకొన్నారు. సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి వేద మంత్రాలతో కల్యాణాన్ని వేదపండితులు నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు సీతారాములను దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.



రాజుపాళెం: టంగుటూరులో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ప్రొద్దుటూరులో.. రామయ్య కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



ప్రొద్దుటూరులోని పోస్టల్ డివిజన్ కార్యాలయం వద్ద పానకం పంపిణీ చేస్తున్న మహిళలు

## క్లుప్తంగా

### దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

**ప్రొద్దుటూరు :** ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు దివ్యాంగులకు దుస్తులను అందించారు. సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్‌హుసేన్, అల్తాఫ్, మహ్మద్‌బాషా, వెంకటసుబ్బయ్య, పవన్, భద్రుడు, హనుమంతు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

### 5న ఢిల్లీలో కార్మిక, కర్షక మైత్రి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

**ప్రొద్దుటూరు :** వివిధ వర్గాలకు చెందిన కార్మికుల, కర్షకుల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో కార్మిక, కర్షక మైత్రి నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ తెలిపారు. తమ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులతోపాటు పేద ప్రజల పక్షాన పనిచేయకుండా వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మున్సిపల్ కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం రూ.26వేలు వేతనం ఇవ్వాలని కోరారు. రైతు ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ్, నరసింహా పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

**గోపవరం :** బద్వేలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో పద్మావతి మెడికల్ స్టోర్స్ వద్ద గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ప్రొద్దుటూరులో..

**ప్రొద్దుటూరు :** స్థానిక సరస్వతి విద్యామందిరం రోడ్డులో మేస్త్రి బాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ ఉమా యాగంటి ఈశ్వర చలివేంద్రాన్ని గురువారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ నరసింహులు ప్రారంభించారు. 47 ఏళ్లుగా బాబయ్య చలివేంద్రం ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమని ఏఎస్‌ఐ కొనియాడారు. ఈ సందర్భంగా పానకం వడపప్పు పంపిణీ చేశారు. గజ్జల వెంకటేశ్వరరెడ్డి, శివకాశి, ఆంజనేయులు పాల్గొన్నారు.

### రేపు గడప గడపకు కార్యక్రమం

**గోపవరం :** మండలంలోని టి.సంద్రపల్లె సచివాలయం పరిధిలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం ఉంటుందని, అనంతరం గడప గడపకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### కో-ఆపరేటివ్ స్టోర్స్‌ను అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న గజ్జల కళావతి

**ప్రొద్దుటూరు :** రానున్న రోజుల్లో ప్రొద్దుటూరు సెంట్రల్ కన్స్యూమర్స్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్‌ను అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అధ్యక్షురాలు గజ్జల కళావతి తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం తొలి మారు గురువారం పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి సూచనతో స్టోర్స్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. 2022-23 ఏడాది జరిగిన జమా ఖర్చుల వివరాలపై చర్చించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### పుల్లారెడ్డిపల్లెలో వాలీబాల్ పోటీలు

**కలసపాడు :** మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని పుల్లారెడ్డిపల్లె యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జయపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలను గెలుపొందిన జట్లకు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి ఏప్రిల్ 3వ లోపు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7036734661, 7093178932 నెంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

## బద్వేలులో..



బద్వేలు అర్బన్: రాములోరి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

**బద్వేలు అర్బన్ :** శ్రీరామనవమి పండుగను గురువారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని గాండ్లవీధి కోదండరామస్వామి దేవాలయం, అమ్మవారిశాల వీధిలోని రామాలయం, అబ్బరాతి వీధిలోని కోదండ రామా లయం, సురేంద్రనగర్ పట్టాభి రామాలయం, శ్రీకృష్ణ దేవరాయనగర్‌లోని రామమందిరం, రాజుగారివీధిలోని అభయాంజనేయస్వామి ఆలయం, ఆంజనేయనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, మడకలవారిపల్లెలోని రామాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఆయా ఆలయాలలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు గ్రామోత్సవాలు నిర్వహించారు.

**అంగరంగ వైభవంగా సీతా రాముల కల్యాణం**

**అట్లూరు :** శ్రీరామనవమి పండుగను పురష్కరించుకుని మండల పరిధిలోని పలు రామాలయాలలో గురువారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా కమలకూరు గ్రామంలో వెలసిన అతిపురాతనమైన రామాలయంతో గ్రామస్తులు ఐకమత్యంతో వేదపండితులచే కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

**కల్యాణం కమనీయం..**

**పోరుమామిళ్ల :** చల్లగిరిగెల శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయంలో, పట్టణంలోని టీటీడీ కల్యాణ మండప సమీపంలోని శ్రీ రామాంజనేయస్వామి దేవాలయంలో, శ్రీరామ్‌నగర్‌లోని రామస్వామి దేవాలయంలో గురువారం అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం వైభవంగా చేశారు. కల్యాణాన్ని చూసేందుకు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పురోహితులు దుర్భాక కిషోర్‌శర్మ శ్రీ రాముడి చరిత్ర, కల్యాణ ఘట్టాన్ని వివరించారు. అన్నదానంతోపాటు పానకం, వడపప్పు, పాయసం పంపిణీ చేశారు.

**ముఖద్వారం ప్రారంభించిన ఎమ్మెల్సీ డీసీ**

చల్లగిరిగెల శ్రీ పట్టాభి రామస్వామి దేవస్థానం ప్రసిద్ధ క్షేత్రమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. కొండుగారిపల్లె వద్ద దాదాపు రూ. 3 లక్షల ఖర్చుతో నిర్మించిన ముఖద్వార మండపాన్ని గురువారం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇక్కడ ముఖద్వార మండపం ఏర్పాటు చేయాలని భక్తుల కోరిక ఇప్పటికి తీరిందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమణారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు బోడపాడు రామసుబ్బారెడ్డి, ముఖద్వార నిర్మాణానికి సహకరించిన భక్తులు పాల్గొన్నారు.

**చల్లగిరిగెల బండలాగుడు పోటీలు**

మండలంలోని చల్లగిరిగెల శ్రీ పట్టాభి రామస్వామి దేవస్థానం శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం బండలాగుడు పోటీలను పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారుడు నాగార్జునరెడ్డి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.

**కాశినాయన మండలంలో..**

**కాశినాయన :** మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం శ్రీరామ నవమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు.

**బి.కోడూరులో..**

**బి.కోడూరు :** శ్రీ రామ నవమి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలను యువత, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ముఖ్యంగా మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామ సమీపాన గల విష్ణుపురంలో శ్రీరామనవమి సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పోతిరెడ్డిపాడు గ్రామానికి చెందిన వృషభాలు ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయి.

**గోపవరంలో..**

**గోపవరం :** మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కొలువైన శ్రీ కోదండ రామస్వామి ఆలయాల్లో గురువారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాన్నీ విద్యుత్ అలంకరణలతో ముస్తాబయ్యాయి. ఆయా గ్రామాల్లో ప్రజలు ఆలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

**కలసపాడులో..**

**కలసపాడు :** మండలంలోని మహానందిపల్లె, మామిళ్ళపల్లె గ్రామాల్లో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మామిళ్ళపల్లెలో గాజులపల్లె వెంకటరమణారెడ్డి దంపతులు, పురోహితులు వారణాసి వెంకటరమణయ్య ఆధ్వర్యంలో రాముల వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.



కలసపాడు: ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



గోపవరం: సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



అట్లూరు: సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



పోరుమామిళ్ల: ముఖద్వారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ డీసీ గోవింద్‌రెడ్డి



బి.కోడూరు: విష్ణుపురంలో బండలాగుడు పోటీల్లో వృషభ రాజములు

## దాహార్తిని తీర్చడం అభినందనీయం



కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జింకా విజయలక్ష్మి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చడం అభినందనీయమని పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్ సమీపంలో పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బీమునిపల్లి లక్ష్మీదేవి, దొరాసానిపల్లె అరవ మునివర, పద్మశాలీయ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నా వెంకట కృష్ణయ్య, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నా వెంకట చంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు, కోశాధికారి శ్రీనివాసులు, కల్యాణ మండప అధ్యక్షుడు అవ్వారు తాండవ కృష్ణ, నాగమళ్ల శంకర్, నందంకుమార్, మునిస్వామి పాల్గొన్నారు.

■ స్థానిక ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డు వాసవి సర్కిల్‌లో కీర్తన సేవాసమితి, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ ఇబ్రహీం ప్రారంభించారు. కీర్తన సేవా సమితి అధ్యక్షుడు రాజు, శ్రీకాంత్, నరసింహా పాల్గొన్నారు.

## వాల్మీకి, బోయల తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి

**కడప రూరల్ :** వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించిన తీర్మానాలను వెనక్కి తీసుకోవాలని ఆలిండియా బంజారా సేవా సంఘం కోశాధికారి డాక్టర్ ఐ.శివానాయక్, రాష్ట్ర సలహాదారు అర్జున్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే వాల్మీకి, బోయలు అభివృద్ధి చెందారని తెలిపారు. అలాంటి వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానించడం తగదన్నారు. ఈ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆ సంఘం నాయకులు వెంకటస్వామి, జగన్నాయక్, కిరణ్‌కుమార్ నాయక్, శ్రీనివాస నాయక్, రఘు నాయక్, కృష్ణా నాయక్ పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న బంజారా సేవా సంఘం నాయకులు